మన మహతి న్యూస్
తెలుగు దిన పత్రిక
TGTEL/26/A0372
ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | గురువారం జూన్ 04, 2026 | సంపుటి : 01 | సంచిక : 126 | పేజీలు 5 | వెల-2/- MANAMAHATINEWS.COM

# దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ..

## పెట్టుబడులపై చర్చ



- దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో సీఎం రేవంత్ భేటీ.
- విద్య, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడులపై చర్చలు.
- తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందానికి ఆహ్వానం.
- "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026"కు ఆహ్వానించిన సీఎం.
- పెద్ద సంఖ్యలో ప్రతినిధులు వస్తారని మషాటిలే హామీ.
- జర్మనీ తురింగియా రాష్ట్రంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.
- శాస్త్ర సాంకేతిక, స్టార్టప్, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సహకారం.

హైదరాబాద్: భారత్‌లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి (=వఝుత్‌ప్త =వఽఽఎ) భేటీ అయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై ఇరు పక్షాలు చర్చించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని సీఎం తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు.హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026"లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను సీఎం ఆహ్వానించారు.

2లో..



## కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

- కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం.
- గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ప్రమాణం చేయించారు.
- బెంగళూరులోని గ్లాస్‌హౌస్‌లో కార్యక్రమం జరిగింది.
- రాజ్యాంగ మినీబుక్‌ను చేతబట్టి ప్రమాణం చేశారు.
- జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు.
- మరో 12 మంది మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు.
- ఖర్గే, రాహుల్ గాంధీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు హాజరు.

2లో

## మేలో రికార్డు స్థాయిలో 1.21 కోట్ల శ్రీవారి లడ్డూల విక్రయం





2లో

## రష్యా పర్యటనలో ఏపీ మంత్రి లోకేశ్..



2లో

మాస్కో: రష్యా ప్రభుత్వ నియంత్రిత ప్రముఖ రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ మాస్కోలో భేటీ అయ్యారు. వెస్ట్రన్ ప్లాట్‌ఫామ్‌లకు సురక్షితమైన లోకలైజ్డ్ జనరేటివ్ ఏఐ ప్రత్యామ్నాయ వ్యవస్థను అందించిన తరహాలోనే భారతదేశంలో బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు స్బేర్ బ్యాంక్ గిగాచాట్ ఎల్ఎల్ఎంను విస్తరించాలని నారా లోకేశ్ కోరారు. జాతీయ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ నెట్‌వర్క్ భద్రతను పటిష్ఠం చేస్తూ, స్బేర్‌బ్యాంక్ అడ్వాన్స్‌డ్ వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారతదేశ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లో ఇంటిగ్రేట్ చేసేలా సాంకేతిక సహకారం అందించాలన్నారు. భారత్‌లో పెద్దఎత్తున మున్సిపల్ కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్, డిజిటల్ సేఫ్టీ సిస్టమ్‌లను విస్తరించాలన్నారు.

## సవరించిన భూముల మార్కెట్ విలువలు అమల్లోకి:



2లో

- రేపట్నుంచి అమల్లోకి సవరించిన భూముల మార్కెట్ విలువలు: పొంగులేటి
- మార్కెట్ పరిస్థితులు, క్షేత్రస్థాయి అధ్యయనం ఆధారంగా సవరణలు.
- 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో సమీక్ష నిర్వహణ.
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, అభివృద్ధి, డిమాండ్‌ను ప్రమాణాలుగా తీసుకున్నట్లు వెల్లడి.
- వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస రేట్ల ఖరారు.
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా సవరణలు చేపట్టినట్లు మంత్రి వ్యాఖ్య.

## తెలంగాణ భూమిపుత్రులే పోటీ చేస్తామంటే అభ్యంతరమేంటి?:




అమరావతి: పొట్టి శ్రీరాములు త్యాగం వల్లనే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని.. అలాంటి మహానాయకులను కులచట్రాల్లో బిగించడం రాజకీయాల్లో అలవాటుగా మారిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతిలో పర్యటించిన ఆయన.. అక్కడి 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.
"తెలంగాణలో ఇంకా తెలంగాణ భావోద్వేగం ఉంది. ఏపీలో అలాంటి భావోద్వేగం లేదు. ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన మహానుభావుడిని కులానికి పరిమితం చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చాక కులదూషణ పెరిగింది. నిరుద్యోగం, అభివృద్ధి గురించి పట్టించుకోకుండా కులాల కుంపట్లు పెరిగాయి. ఈ వాతావరణాన్ని అడ్డుకునేందుకే సేనాగళం పేరుతో కమిటీ ఏర్పాటు చేశాం.

2లో..

## ఆ ఛాన్స్ లేక స్పోర్ట్స్ కోటాపై పడ్డారు:

### ఏపీ హోంమంత్రి అనిత

- డీఎస్సీపై జగన్ విషప్రచారం చేస్తున్నారని మంత్రి అనిత విమర్శ.
- తప్పుడు ప్రచారాలపై క్రిమినల్ కేసులు ఉంటాయని హెచ్చరిక.
- ప్రశ్నపత్రాల లీక్‌కు అవకాశం లేక స్పోర్ట్స్ కోటాపై ఆరోపణలు చేస్తున్నారని వ్యాఖ్య.
- డీఎస్సీ నియామకాలు 2022 హారిజాంటల్ రిజర్వేషన్ ప్రకారమే జరిగాయని స్పష్టం.
- వైకాపా నేతలకు సమస్యే కావాలి, సమాధానం కాదని విమర్శ.
- బ్రిడ్జ్ స్పోర్ట్స్‌పై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపాటు.



అమరావతి: డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఏ ఆత్మ చెప్తే.. జగన్ 9 నెలల తర్వాత విషప్రచారం మొదలుపెట్టారని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ప్రశ్నించారు. ప్రజలకు అర్థమయ్యేలా సమాధానాలు చెప్తామని, విష ప్రచారాలను కట్టడి చేస్తామని తెలిపారు. తప్పుడు ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు ఉంటాయని వెల్లడించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారిలో అత్యధిక శాతం తెదేపా ప్రభుత్వంలో నియమితులైన వారేనని చెప్పారు. డీఎస్సీపై వైకాపా ఆరోపణల నేపథ్యంలో మంత్రి మీడియాతో మాట్లాడారు.

మిగతాది 2లో

## నేను చెప్పినవన్నీ తప్పు అని నిరూపిస్తే..

### రాజకీయాలు వదిలేస్తా: కేటీఆర్



మిగతాది 2లో

# సంపాదకీయం

## రాజకీయం సరే, ఆర్థికం మాటేమిటి?

'ఆడుతూ ఉన్నప్పుడే మీరు గెలుస్తారు. మీరు ఆడకపోతే గెలుపెలా వస్తుంది?' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల చిన్నపిల్లలతో మాట్లాడుతూ అన్నారు. 1987లో భారతీయ జనతా పార్టీలో చేరినప్పటి నుంచీ నరేంద్రమోదీ రాజకీయాల్లో ఆడుతూనే ఉన్నారు. వచ్చే ఏడాది ఈ రాజకీయ క్రీడలో నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకోనున్న మోదీకి ఇప్పటి వరకూ చెప్పుకోదగ్గ ఓటమి వాటిల్లలేదు. 1987లో బీజేపీ గుజరాత్ ప్రధాన కార్యదర్శిగా ఆయనకు అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ బాధ్యతలు అప్పజెప్పినప్పుడు తొలిసారి తన పార్టీకి ఆ నగర పాలనా సంస్థను కైవసం చేయడంలో సఫలమయ్యారు. అప్పటి నుంచీ ఆయన వెనక్కు తిరిగి చూడనే లేదు. కార్పొరేషన్ గెలుపుతో గుజరాత్‌లో ప్రారంభమయిన ఆయన విజయ ప్రస్థానం రాష్ట్రంలో బీజేపీని అధికారంలో తెచ్చి, తర్వాత స్వయంగా తానే ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి, 12 సంవత్సరాలు తిరుగులేని పాలన చేపట్టేంతవరకూ సాగింది. అంతటితో ఆగకుండా మోదీ 2014లో ఏకంగా దేశ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. కేంద్రంలోనూ నిరాఘాటంగా గత 12 సంవత్సరాలుగా ఆ అత్యున్నత పదవిలో కొనసాగుతున్నారు. 1987లో మోదీ ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించేనాటికి కాంగ్రెస్ కేంద్రంలోనూ, 15 రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉండేది. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో గెలుపుతో మోదీ సారథ్యంలో బీజేపీ, దాని మిత్రపక్షాలు 21 రాష్ట్రాల్లో అధికారం సాధించినట్లయింది. ఒక రకంగా మోదీ ఇప్పుడు రాజకీయ జీవితపు మహోన్నత దశలో ఉన్నారు. ఒకవైపు 12 సంవత్సరాల తన పాలన విజయోత్సవాలకు సన్నాహాలు చేస్తూనే మరోవైపు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ భారీ మార్పులకు ఆయన సిద్ధమవుతున్నారు. తన తదుపరి రాజకీయ క్రీడకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నారు.

'గెలుపు క్రీడ మాత్రమే కాదు, అది పులిపై స్వారీ చేయడం లాంటిది' కూడా అని రాజనీతిజ్ఞులు అభివర్ణిస్తుంటారు. ఒక్కసారి దానిపై నుంచి దిగితే అదే మనను స్వాహా చేస్తుంది. 'ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల్లో విజయం సాధించడం మాత్రమే కాదు' అని అంబేడ్కర్ ఎప్పుడో చెప్పారు. రాజకీయాల్లో మోదీ ప్రభుత్వానికి తిరుగు లేకపోయినా, భారత ఆర్థిక పరిస్థితి మాత్రం ఆందోళనకరంగా ఉన్నది. జీడీపీ పెరుగుదల క్రమంగా తగ్గుతోందని, సగటు ద్రవ్యోల్బణం రెట్టింపు అవుతోందని, అభివృద్ధి వేగం మందకొడిగా సాగుతోందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. మే నెలలో ఆర్థిక మంత్రిత్వశాఖ రూపొందించిన నెలవారీ సమీక్ష అంతర్జాతీయ పరిణామాలు భారతదేశ ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని స్పష్టం చేసింది. రూపాయి విలువ రోజురోజుకూ పడిపోతోంది. క్రూడాయిల్ దిగుమతి బిల్లులు పెరుగుతున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మే 15 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగుసార్లు పెరిగాయి. వరుసగా రెండో వారం భారత విదేశీమారక ద్రవ్య నిల్వలు పడిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు కూడా తగ్గిపోతున్నాయని మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం వంటి ఆర్థికవేత్తలు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. జపాన్‌ను అధిగమించి నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందని మే 2025లో నీతీ ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం ప్రకటించారు. కానీ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ తాజాగా విడుదల చేసిన వరల్డ్ ఎకనమిక్ అవుట్ లుక్ ప్రకారం భారతదేశం ఆరవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు పడిపోయింది. ఈ విషయం ఎలా ఉన్నప్పటికీ గణాంక వివరాలతో సంబంధం లేకుండా దేశంలో తలసరి ఆదాయం అతి తక్కువస్థాయిలో ఉన్నదని అందరికీ తెలుసు. 1991 నుంచి చైనాలో తలసరి ఆదాయం 38సార్లు పెరిగితే.. మన దేశంలో కేవలం 8సార్లే పెరిగిందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ప్రధాని మోదీ స్వయంగా పొదుపు చర్యలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేయడమే పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్వల్పకాలిక చర్యలు తీసుకుంటోంది కానీ, దీర్ఘకాలిక చర్యలు చేపట్టడం లేదని ఆర్థికవేత్తలు అంటున్నారు. దీర్ఘకాలిక చర్యలు అంటే ఏమిటి? సంస్కరణలను మరింత వేగవంతం చేయడమా? విదేశీ పెట్టుబడులు మరింత స్వేచ్ఛగా ప్రవేశించేందుకు వీలు కల్పించడమా అన్న చర్చలు జరుగుతున్నాయి. మోదీ ఈ దిశగా ఏ చర్యలు తీసుకుంటున్నారో ఎవరికీ స్పష్టత లేదు. దేశ ఆర్థిక పరిస్థితిపై నీతీ ఆయోగ్ వంటి సంస్థలు కూడా పారదర్శకంగా నివేదికలు ప్రకటించడం లేదు. ఇలాంటి సంస్థలు అభివృద్ధిని గోరంతలు కొండంతలు చేసేందుకే తహతహలాడుతుంటాయి. ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితిని చెప్పేందుకు అవి ప్రయత్నించడం మానేసి చాలా కాలమైంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా మంత్రుల తలలు మారిస్తే మాత్రం పరిస్థితి మెరుగవుతుందా?

రెండవది, ఎన్నికల్లో విజయం సాధించలేకపోతోన్న ప్రతిపక్షాలు.. వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయన్న అభిప్రాయాన్ని ప్రజల్లో కల్పించడంలో విజయవంతమయినట్లే కనిపిస్తున్నాయి. ఎన్నికల కమిషన్, సీబీఐ, ఈడీ, ఐటీ, సీవీసీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వంటి సంస్థల పనితీరుపై మాత్రమే కాదు, సుప్రీంకోర్టు ఇస్తున్న తీర్పులపై కూడా అనుమానం కలిగించేందుకు ఆస్కారం కలిగిస్తున్నాయి. విచిత్రమేమంటే ఎన్నికలు సవ్యంగా జరిగినా ఎన్నికల కమిషన్ విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతోంది. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఎడాపెడా ప్రయోగించడం వల్ల అవి నిజంగా పనిచేసినా వాటిపై నమ్మకం కలగడం లేదు. సుప్రీంకోర్టుకూ, ప్రభుత్వానికీ మధ్య ఉండాల్సిన హద్దులు చెరిగిపోతున్నాయా అన్న అనుమానం కలిగే విధంగా న్యాయమూర్తులు వ్యవహరిస్తున్నారు. చివరకు విద్యార్థులకు పరీక్షలు కూడా సరిగా నిర్వహించలేని దుస్థితి ఈ దేశంలో నెలకొన్నదని నీట్ ప్రశ్నపత్రాలు మరోసారి లీక్ కావడంతో తేలింది. ఈ పరిస్థితులపై కాక్రోచ్ జనతా పార్టీ పేరిట సోషల్ మీడియాలో ఇచ్చిన పిలుపునకు ఈ దేశ యువత కనీవినీ ఎరుగని రీతిలో ప్రతిస్పందించిన తీరు ఎక్కడో నిప్పు రగులుతోందన్న భావనను కలిగిస్తోంది.

# నేను చెప్పినవన్నీ తప్పు అని నిరూపిస్తే..

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వమే తెలంగాణ ఇచ్చినప్పటికీ.. ఇవ్వక తప్పని పరిస్థితి సృష్టించింది కేసీఆర్‌యేనని వెల్లడించారు.

"2014లో తెలంగాణలో సాగుభూమి విస్తీర్ణం 1.50 కోట్ల ఎకరాలు మాత్రమే. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి సాగు భూమి విస్తీర్ణం 2.29 కోట్ల ఎకరాలకు చేరింది. దశాబ్ద కాలంలో సుసంపన్నమైన తెలంగాణను ఆవిష్కరించాం. రాష్ట్రాన్ని పరిపాలించే నాయకత్వ పటిమ మీకుందా? అని ఆనాడు కొందరు అన్నారు. మాకు కూడా కేసీఆర్‌లాంటి పాలకుడు కావాలని అనుకునేలా పదేళ్ల పాలన సాగింది. దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగింది. వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలు కరెంట్ ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఎన్నికల అజెండాలో లేకున్నా రైతుకు పెట్టుబడి సాయం చేసే రైతు బంధు తీసుకొచ్చాం. తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపాం. నేను చెప్పినవన్నీ తప్పు అని నిరూపిస్తే.. శాశ్వతంగా రాజకీయాలను వదిలేస్తా.

నాలుగు కోట్ల ప్రజలు మా కుటుంబమే అని భావించి పాలించాం. ఇప్పుడు తెలంగాణ వ్యతిరేకులు పదవిలో కూర్చోవడమే బాధాకరంగా ఉంది. తెలంగాణ ఉద్యమకారులపైకి తుపాకీ పట్టిన వ్యక్తి పదవిలో ఉండటం బాధగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది" అని కేటీఆర్ విమర్శించారు.

### పవన్ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను తెలంగాణలో ప్రజలే అడ్డుకున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఏర్పడితే అన్నం తినని వ్యక్తి.. రాష్ట్ర అవతరణ రోజు సభ ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. తెలంగాణలో జనసేన కొత్తగా పోటీ చేసేదేముందన్నారు. "ప్రాంతీయవాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదకరమని పవన్ అన్నారు. పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించారు. దాన్ని తప్పు పడతారా?" అని ప్రశ్నించారు. జాతీయవాదం గురించి పవన్ వద్ద పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు.

# సవరించిన భూముల మార్కెట్ విలువలు అమల్లోకి:

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు రేపటి నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు.

"భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఫ్లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస రేట్లు ఖరారు చేశాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాం"అని మంత్రి తెలిపారు.

# కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

మొదటిపేజీ తరువాయి

కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఆయనతో ప్రమాణం చేయించారు. బుధవారం లోక్‌భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ, కేరళ, హిమాచల్ ప్రదేశ్ సీఎంలు రేవంత్ రెడ్డి, వీడీ సతీశన్, సుఖ్విందర్ సింగ్ సుఖు, ఇతర ఏఐసీసీ నేతలు హాజరయ్యారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.

జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. కేహెచ్ మునియప్ప, కె.జె.జార్జ్, ఎంబీ పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జర్కిహోళి, కృష్ణబైరె గౌడ, యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌కు మంత్రి పదవులు దక్కాయి.

# మేలో రికార్డు స్థాయిలో 1.21 కోట్ల శ్రీవారి లడ్డూల విక్రయం

మొదటిపేజీ తరువాయి



తిరుమల: ఈ ఏడాది మే నెలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మొత్తం 1.21 కోట్ల లడ్డూలను విక్రయించినట్లు తితిదే వెల్లడించింది. 2024 మే నెలలో 1.01 కోట్లు, 2025 మే నెలలో 1.10 కోట్ల లడ్డూలను విక్రయించగా.. ఈసారి సంఖ్య మరింత పెరిగింది. రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను తయారు చేసింది. లడ్డూల తయారీకి తితిదే రోజువారీగా 68 టన్నుల ముడి పదార్థాలను వినియోగిస్తోంది. ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత, సంప్రదాయం, భక్తి భావనల సమ్మేళనంగా నిలిచే శ్రీవారి లడ్డూ ప్రసాదం తిరుమల మహాత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెబుతోంది.

# దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ..

మొదటిపేజీ తరువాయి

సీఎం ఆహ్వానంపై మషాటిలే స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో తమ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు.

అనంతరం జర్మనీలోని తురింగియా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో తురింగియా ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

# ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం లేకపోతే లాభం ఉండదు: చంద్రబాబు

తక్కెళ్లపాడు: ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే ఏ వ్యవస్థ అయినా మనుగడ సాగిస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో లలిత పీవీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లలిత ఆసుపత్రి.. ల్యాండ్ మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా తయారు కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

"ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభం ఉండదు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులు. వేల కోట్లు, పదవులు ఉన్నా.. ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదు. లలిత ఆసుపత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైంది. 32 విభాగాలకు వైద్య సేవలు అందించే ఏకైక కేంద్రమిది.

సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టును తీసుకొస్తున్నాం. పేదవాళ్ల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మంచి అలవాట్లతో అనారోగ్యం మన దరి చేరదు. యోగా, ధ్యానం వంటి వాటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మనం తినే ఆహారమే.. మన ఆరోగ్యాన్ని రక్షిస్తుంది" అని చంద్రబాబు తెలిపారు.

# ప్రజాస్వామ్యంలో ఎవరైనా.. ఎక్కడైనా సభలు నిర్వహించుకోవచ్చు:

**వైకాపా గుర్తింపును ప్రజలే రద్దు చేస్తారని వ్యాఖ్య.**

అమరావతి: హైదరాబాద్‌లో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. తెలంగాణలో పవన్ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా, ఎక్కడైనా సభలు నిర్వహించుకోవచ్చన్నారు. తానూ తమిళనాడుకి వెళ్లి ప్రచారం చేశానని చెప్పారు. "రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్ల సమయం గడిచిపోయింది. ప్రజలకు ఎవరు మంచి చేశారనేది అందరికీ తెలుసు. ప్రజలకు మంచి చేయడంలో నాయకులు పోటీ పడాలి గానీ, ప్రజల మధ్య విభేదాలు తెచ్చేందుకు పోటీపడకూడదు. అభివృద్ధిని లాజికల్‌గా తీసుకెళ్లాలి. అనవసరంగా వివాదాలు సృష్టించడం ఎవరికీ మంచిది కాదు"అని హితవు పలికారు.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఆరోపణలపై సీఎం స్పందిస్తూ.. డీఎస్సీపై విషప్రచారంతో యువతలో గందరగోళం సృష్టించేందుకు వైకాపా ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. బ్రిడ్జ్ స్పోర్ట్స్‌పై అవగాహన లేకుండా గొడ్డలిపార్టీ నేతలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నోరు, పేపర్, పేటీఎం బ్యాచ్ ఉన్నాయని.. నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజలు వైకాపా గుర్తింపును రద్దు చేసే రోజు దగ్గర్లోనే ఉందన్నారు.

# ఈసారి కృష్ణానది వెస్ట్ బైపాస్ రోడ్డుపై యోగా కార్యక్రమం: ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి: ఆరోగ్యాంధ్రప్రదేశ్, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించాలంటే యోగాంధ్ర చాలా ముఖ్యమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో యోగా కార్యక్రమంపై ఆయన మీడియాతో మాట్లాడారు. జీవన విధానంలో యోగాను భాగం చేసేందుకు యోగాంధ్రను ఏటా జరపాలని నిర్ణయించామని సీఎం తెలిపారు. ఈ ఏడాది యోగా దినోత్సవానికి 'యోగా ఫర్ హెల్తీ ఏజ్' థీమ్‌ను పాటిస్తున్నట్లు చెప్పారు. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సంజీవని పథకంలో యోగాను అనుసంధానం చేస్తామని తెలిపారు.


"ఈ నెల 7 నుంచి 20 వరకు 14 రోజులపాటు యోగా కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు, కార్యాలయాలు అందరూ భాగస్వామ్యం కావాలి. ప్రతి జిల్లా, మండల కేంద్రం ఇలా ఎన్ని చోట్ల వీలైతే అన్ని చోట్ల యోగా కార్యక్రమాలు నిర్వహించాలి. యోగాంధ్ర 2026లో కనీసం కోటి మంది పాల్గొనేలా లక్ష్యం పెట్టుకోవాలి. 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేయాలి. గతేడాది యోగా కార్యక్రమాలతో అనేక రికార్డులు సాధించాం. ప్రపంచమంతా ఏపీ వైపు చూసేలా చేయగలిగాం. నిరుడు విశాఖ బీచ్ పక్కన రోడ్డుపై యోగా చేశాం. ఈసారి కృష్ణా నది వెస్ట్ బైపాస్ రోడ్డుపై యోగా చేస్తాం. అమరావతి అందాన్ని ప్రపంచానికి చూపించే అవకాశం కూడా ఉంటుంది" అని చంద్రబాబు అన్నారు.

21 వ్యాధులకు సంబంధించి యోగాసనాల వీడియోలను ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించారని చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియాలో ఈ వీడియోలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. 8142404888 కాల్ సెంటర్‌ను సంప్రదించి సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చని చెప్పారు.

ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజినీర్లకు వేగంగా శిక్షణ ఇవ్వడానికి, స్బేర్ బ్యాంక్ గేమిఫైడ్, పీర్-టు-పీర్ "స్కూల్ 21" కోడింగ్ అకాడమీలను భారతదేశంలోని ప్రధాన విద్యా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని కోరారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం దూరప్రాంతాలకు రూపాయి-రూబుల్ వాణిజ్య అనుమతులు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. తమ బ్యాంక్ భారత్‌లోని న్యూఢిల్లీ కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక కమర్షియల్ ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు, భారత్-రష్యా క్లయింట్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ చెప్పారు. మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# ఆ ఛాన్స్ లేక స్పోర్ట్స్ కోటాపై పడ్డారు:

మొదటిపేజీ తరువాయి



"డీఎస్సీ పోస్టింగ్ అనేది ఎన్నో కుటుంబాలకు ఎమోషనల్ బాండింగ్. ఏ కోర్టు కేసూ అడ్డంకి రాకుండా అన్ని సమస్యలు పరిష్కరించి గౌరవప్రదంగా ప్రతి ఒక్కరికీ నియామక పత్రాలు అందజేశాం. ప్రశ్నపత్రాల లీక్‌కు అవకాశం లేకపోవటంతో స్పోర్ట్స్ కోటాపై పడ్డారు. గొడ్డలి పార్టీ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు. ఆ పార్టీ నేతలకు సమస్యనే కావాలి.. సమాధానం కాదు. వైకాపా అధికారంలో ఉండగా 2022లో తెచ్చిన హారిజాంటల్ రిజర్వేషన్ ఆధారంగానే డీఎస్సీ నియామకాలు జరిగాయి. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల ముందు పెట్టిన మహామహులు బ్రిడ్జ్ స్పోర్ట్స్‌పై అవగాహన లేమితో మాట్లాడుతున్నారు. బ్రిడ్జ్ స్పోర్ట్స్ అంటే గొడ్డలి పార్టీ నేతలు నిర్వహించిన జూద శిబిరాలు కాదు"అని మంత్రి అనిత మండిపడ్డారు.

# తెలంగాణ భూమిపుత్రులే పోటీ చేస్తామంటే అభ్యంతరమేంటి?:

మొదటిపేజీ తరువాయి

ఇందులో అన్ని వర్గాల నాయకులు ఉంటారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడి కులం వెనుక దాక్కొనే సంస్కృతి వద్దు. తెలంగాణలో పార్టీ ఆఫీసు తీసేసినా నాయకులు, జనసైనికులు అలాగే ఉన్నారు. నిన్న జరిగిన పరిణామాలతోనే తెలంగాణలో పోటీపై ప్రకటన చేయాల్సి వచ్చింది. దేశ సమగ్రతకు భంగం కలిగించే దేన్నయినా గట్టిగా అడ్డుకుంటా. తెలంగాణ, గద్దర్ కుటుంబ సభ్యులపై నాకు గౌరవం ఉంది. తెలంగాణ కోసం పనిచేస్తాం.

తెలంగాణ భూమిపుత్రుల జాగీరు. దాన్ని ఎవరూ కాదనరు. కానీ, అందులోకి రానివ్వమని చెప్పడంపైనే అభ్యంతరం వ్యక్తం చేశా. గద్దర్ వంటి వారు ఎప్పుడూ ఇలా ఎవరినీ రావొద్దని మాట్లాడలేదు. కేటీఆర్ నాకు సోదరుడితో సమానం. ఆయన ఏం మాట్లాడారో నేను వినలేదు. ఆంధ్రా నాయకులు ఎవరూ వెళ్లి తెలంగాణలో పోటీ చేయట్లేదు. తెలంగాణ భూమి పుత్రులే పోటీ చేస్తామంటే అభ్యంతరమేంటి? ఈ వ్యవహారం చిలికి చిలికి గాలివానలా మారింది. కుట్ర ఉందని నేను చెప్పలేను. విద్వేషాలకు ముగింపు పలకాలనేదే నా ఆలోచన" అని పవన్ అన్నారు.

## లాల్ బహదూర్ కళాశాల ఎన్సిసి బెటాలియన్ ఆర్మీ వింగ్ ఆధ్వర్యంలో బి సర్టిఫికెట్

**వరంగల్ జిల్లా జూన్ 3 న్యూస్**

స్థానిక లాల్ బహదూర్ కళాశాల ఆడిటోరియంలో వరంగల్ పదవ తెలంగాణ ఎన్సిసి బెటాలియన్ ఆర్మీ వింగ్ ఆధ్వర్యంలో" 2026 ఎన్సిసి "బి సర్టిఫికెట్' "పూర్తిచేసిన ఉమ్మడి వరంగల్ ఎన్సిసి క్యాడేట్స్ కు సర్టిఫికెట్స్ ప్రధానం బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఎస్ఎస్ రామదురై పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పదవ తెలంగాణ ఎన్సిసి బెటాలియన్ నుండి హాజరై మాట్లాడుతూ. ఎన్సిసి రెండు సంవత్సరాల కోర్స్ పూర్తి చేసి పాసైన ఎన్సిసి " బి "సర్టిఫికెట్ ఇప్పుడు పూర్తి చేసుకున్న కడేట్స్ ఆర్మీలో ప్రవేశించడానికి ఒక రాజా మార్గమని సర్టిఫికెట్ స్వీకరించిన వారిని ఉద్దేశించి మాట్లాడితు భారత ఆర్మీలో ఎన్సీసీ రెండవ ఉపసైనిక దళమని భారత రక్షణలో చేరి దేశ రక్షణలో భాగస్వాములు కావాలని క్రమశిక్షణ కలిగిన ఎన్సిసి ద్వారా మంచి నాయకత్వం కలిగిన యువ రక్తాన్ని దేశభద్రతకు అనుసంధానం చేయడం ఎన్సిసి యొక్క ముఖ్య ఉద్దేశమని ప్రపంచంలోనే అతిపెద్ద యూత్ ఆర్గనైజేషన్ భారత రక్షణ




శాఖ అనుబంధంగా పనిచేస్తున్న ఎన్సిసి దేశ యువతకు ఒక రోల్ మోడల్ అని దేశ రక్షణ కోసం ఒక పునాదిరాళ్లుగా అత్యంత క్రమశిక్షణతో, జాతీయ సమైక్యభావంతో, నాయకత్వ లక్షణాలతో, అత్యంత దేశభక్తి కలిగిన యూత్ ఎన్సిసిలో కఠోరమైన శిక్షణ పొంది దేశ సైనికులుగా వివిధ రంగాల్లో స్థిరపడడానికి ఎన్సీసీ సర్టిఫికెట్లు ఎంతో దోహదం చేస్తాయని . ఇండియన్ మిలిటరీ అకాడమీ, నేషనల్ టిఫిన్స్ అకాడమీ, ఎస్ ఎస్ బి ద్వారా, చిన్న వయసులోనే ఆర్మీ అధికారులుగా ఎంట్రీ ఐ దేశ రక్షణ సేవకు సిద్ధం కావాలని లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే తెలిపారు. ఈ సర్టిఫికెట్ పూర్తి తర్వాత మళ్లీ ఉజ్వల భవిష్యత్తు కోసం" సి" సర్టిఫికెట్ కూడా పూర్తి చేసుకుని భారత సైన్యంలో స్థిరపడాలని మరియు కేంద్ర పారా మిలిటరీ మరియు రాష్ట్రస్థాయిలో పోలీస్ విభాగాల్లో , కేంద్ర ,రాష్ట్ర ఉద్యోగాల్లో పొందడానికి ప్రత్యేక రిజర్వేషన్ ఎన్సిసి ద్వారా పొంది ఉన్నతమైన అధికారులుగా జీవితంలో స్థిరపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ముంద్రాతి సదానందం, నాయబ్ సుబేదారి అనిల్ జాదవ్, బెటాలియన్ హవల్దార్ మేజర్ బెటా గేరికరూ సందీప్ ,లెఫ్టినెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, ట్రైనింగ్ విభాగం ఇంచార్జ్ కుమారస్వామి, హవెల్దార్ విష్ణు,హవల్దార్ నిషాద్, హవెల్దార్ నిక్లేష్ కుమ్మే, డాక్టర్ రాజేందర్, ఈశ్వర్, ఉమ్మడి వరంగల్ వివిధ ఎల్బీ కళాశాల, సికేం, కేడీసీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, ప్రభుత్వ ఐటిఐ, గవర్నమెంట్ ఏబీవీ డిగ్రీ కళాశాల జనగాం, నర్సంపేట గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, నర్సంపేట సైనిక డిగ్రీ కళాశాల, వాగ్దేవి డిగ్రీ కళాశాల, ప్రభుత్వ వ్యవసాయ డిగ్రీ కళాశాల, ధర్మసాగర్ కళాశాలాల ఎన్సిసి క్యాడేట్స్ సర్టిఫికెట్లను స్వీకరించారు. 355 క్యాడేట్స్ పాసైనారు అని లాల్ బహదూర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డి హెచ్ రావు తెలిపారు

## ప్రైవేట్ కాలేజ్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

**•లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ డిమాండ్.**

**హనుమకొండ జిల్లా జూన్ 3 న్యూస్**

రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న ప్రైవేట్ పాఠశాలల ఫీజులను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణమే "ఫీజుల నియంత్రణ చట్టం" తీసుకురావాలని

లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ ప్రకటనలో డిమాండ్ చేస్తూ. విద్యా వ్యాపారమే పరమావధిగా సాగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల ధనదాహానికి సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రులు బలైపోతున్నారని నాయొక్క ఆవేదన వ్యక్తం చేస్తున్న .

ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఫీజుల పేరుతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నాయని వారిపై మండిపడుతున్న .విద్యా ప్రమాణాలను పెంచడం పక్కన పెట్టి,కేవలం లాభార్జనే ధ్యేయంగా విద్యాసంస్థలను నడుపుతున్నారు .

ప్రభుత్వ అనుమతులు లేకుండా,విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా కాలేజ్ పాఠశాలల ప్రాంగణాల్లోనే



పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్,టై,బెల్ట్,మరియు యూనిఫామ్‌లను విక్రయిస్తూ ప్రైవేట్ యాజమాన్యాలు దోపిడీకి తెరలేపుతున్నారు వారిపై ప్రభుత్వం కఠిన చర్య తీసుకోవాలని మండిపడ్డారు.

బయట మార్కెట్ కంటే రెట్టింపు ధరలకు ఈ వస్తువులను పాఠశాలల్లోనే కాలేజీ లోనే కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడం అన్యాయం బి

కళ్ళ ముందే ఇంతటి దోపిడీ జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటి.

ప్రైవేట్ కాలేజ్ పాఠశాలల్లో ఫీజులను క్రమబద్ధీకరించడానికి తక్షణమే ఒక బలమైన ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి కోరారు.

నిబంధనలు ఉల్లంఘించి స్కూల్ క్యాంపస్‌లలో పుస్తకాలు,యూనిఫామ్‌లు విక్రయిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రతి కాలేజ్ పాఠశాలలో ఫీజుల వివరాలను,నిబంధనలను పారదర్శకంగా బోర్డులపై ప్రదర్శించేలా చూడాలి.

సామాన్యుడికి విద్యను దూరం చేస్తున్న ఇటువంటి వ్యాపార ధోరణిపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి,తనిఖీలు చేపట్టాలని కాలేజీలో స్కూళ్లలో చేపట్టాలని లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ విద్యాశాఖ అధికారులను ప్రభుత్వాన్ని కోరారు

## ఘనంగా.ప్రపంచ సైకిల్ దినోత్సవ.వేడుకలు.

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.**

తెలంగాణ రాష్ట్ర సైకిలింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పి. మల్లారెడ్డి, విజయ కాంతారావు ఆదేశాలు మేరకు నారాయణపేట జిల్లా సైకిలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో జూన్ 3 ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్ నుండి కొత్త గార్లపల్లి రోడ్డు వరకు వందమంది బాలబాలికలతో సైకలింగ్ ర్యాలీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి గోపాలం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . ఈ సైకిల్ ర్యాలీని అధ్యక్షుడు తాన్ సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరము బాలబాలికలకు ఐదు కిలోమీటర్ల రోడ్డు స్పీడ్ సైకిల్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి మెమొంటోస్ ,మెడల్స్ అందజేశారు.




అలాగే జాతీయస్థాయి ,రాష్ట్రస్థాయి సైకిల్ పోటీలలో పాల్గొన్న 30 మంది బాలబాలికలకు శాలువతో, మెడల్ అందజేసి ఘనంగా సన్మానించి అభినందించారు .ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి . గోపాలం మాట్లాడుతూ ఈ రోజున సైకిల్ ప్రాముఖ్యతను ప్రజల్లో అవగాహన కల్పించుటకు ర్యాలీ నిర్వహించమని, సైకిల్ తొక్కడ మూలంగా ఆరోగ్య ప్రయోజనాలు శరీరాన్ని పిట్టుగా ఉంచడం, కండరాలు, ఎముకలు గట్టి పడతాయని, ఒత్తిడి తగ్గుతుందని, రక్తప్రసరణ బాగా జరుగుతుందని , కొవ్వులు కరిగిస్తుందని, కాళ్లకు బలం, మానసిక ఆరోగ్యం, శారీరక సమితులతను పెంచుతుందని, రక్తపోటు తగ్గిస్తుందని ,రోడ్డు భద్రతను, కాలుష్య నివారణకు సైకిలు ఉపయోగపడుతుందని బి.గోపాలం తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోళ్ల వెంకటేష్, జి. శివకుమార్, మూర్తి, రవూఫ్ ,పిడి, పిఈటిలు విష్ణువర్ధన్, మీనా కుమారి, రేణుక ,ఈశ్వర్, చంద్రకళ, అనూష, వినయ్, తల్లిదండ్రులు శాంతమ్మ, అనిల్, గోవింద్, మేకల ఆంజనేయులు, రామాంజి, వందమంది బాలబాలికలు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో - ఘనముగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**•స్వచ్ఛంద సేవ అవార్డు గ్రహీతగా - భ్రమరాంబ!**



**మన మహతిప్రతినిధి:భ్రమరాంబ**
**తల్లాడ న్యూస్,జూన్.4**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ అండ్ ఫౌండర్ డాక్టర్ తెల్లూరి చెన్నయ్యు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాలు నందు తెలంగాణ రాష్ట్ర విభవ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు కు చెందిన జై భీమ్ సేవాదళ్ (భారత్)స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు భ్రమరాంబకు ఉత్తమ సేవ అవార్డును అందించిన హ్యూమన్ రైట్స్ నేతలు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల ఎంపీడీవో శ్రీధర్ రాజు,గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ లక్ష్మారెడ్డి,హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బొడ్డుపాటి దాసు,యనమల రుక్మిని,(మేడిది సుబ్బయ్య ట్రస్ట్)మేడిది వెంకటేశ్వరరావు,స్టేట్ ప్రెసిడెంట్ పార్వతి తేజావత్,డిస్టిక్ ప్రెసిడెంట్ రాంబాబు తేజావత్, తదితరులు పాల్గొన్నారు.

## 108 మాత శిశు అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

**• జిల్లాప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలి**
**- ఉమ్మడి జిల్లా పోగ్రా మేనేజర్ రవికుమార్**



**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**

108 ఉచిత మాత శిశు అంబులెన్స్ వైద్య సేవలు వినియోగించుకోవాలి సునీల్ కుమార్( జిల్లా మేనేజర్)

నారాయణపేట జిల్లా: నారాయణపేట జిల్లా ఆసుపత్రి దగ్గర ఉండే ప్రభుత్వ 108 మాతా శిశువు అంబులెన్స్ ను ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్ గారు ఆకస్మిక తనిఖీ చేశారు, తనిఖీలో భాగంగా ఉద్యోగుల పనితీరు, జిల్లా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు మరియు అంబులెన్స్ లో ఉండే మందులు మరియు రికార్డులను పరిశీలించి, అత్యవసర సమయంలో అంబులెన్సులు ఆక్సిజన్ ఉంచుకోవాలని మరియు గోల్డెన్ అవర్ లోపు ప్రమాద బాధితులను ప్రభుత్వ హాస్పిటల్ చేర్చాలని, 108 సిబ్బందికి తగు సూచనలు చేశారు, ఆయన వెంట జిల్లా మేనేజర్ సునీల్ కుమార్ మరియు 108 సిబ్బంది పాల్గొన్నారు

## కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.



**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**

లింగంపల్లి గ్రామంలో కంటి శస్త్ర చికిత్స చేసుకున్నవారికి మందులు, కళ్లద్దాలు, పండ్లుడ బ్రెడ్లు అందజేతమక్తల్ నియోజకవర్గ వ్యాప్తంగా డాక్టర్ వాకిటి శ్రీహరన్న సేవాసమితి ఆధ్వర్యంలో చేపడుతున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను కంటి సమస్యలు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి వ్యవస్థాపకులు అల్కూరి రవికుమార్ తెలిపారు.

లింగంపల్లి గ్రామంలో వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి ఆధ్వర్యంలో లింగంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ , వార్డు సభ్యుల సహకారంతో నిర్వహించిన కంటి వైద్య శిబిరం లో శస్త్ర చికిత్సలు చేసుకున్న వారిని గ్రామంలో కలిసి జాగ్రత్తలు చెప్పడంతో పాటు మందులు, పండ్లుడ బ్రెడ్లు అందించారు.

నియోజకవర్గ వ్యాప్తంగా వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి ఆధ్వర్యంలో ఇప్పటికే వందలాది మంది కి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు అందించామని వ్యవస్థాపకులు అల్కూరి రవికుమార్ తెలిపారు. వైద్యః కోసం మంత్రి వాకిటి శ్రీహరి అహర్నిశలు కృషి చేస్తున్నారని, దసరావరకు 150పడకల ఆసుపత్రి ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. మక్తల్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి గారి కి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్ రాములు గౌడ్, అంబాదాస్ రావు, గ్రామ ఉప సర్పంచ్ , వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతం.....




**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం. లో బుధవారం.**

కంటి పరిక్ష శిబిరం సత్య ఆంజనేయులు అధ్యక్షుడు సమక్షంలో అనుగొండ శ్రీనివాసులు డిస్ట్రిక్ విజన్ ఛైర్మెన్ ఆధ్వర్యంలో కంటి పరిక్ష శిబిరంలో పాల్గొని దాదాపు 100 మంది పాల్గొనగా అందులో పరీక్షలు నిర్వహించగా 45 మందికి కంటి ఆపరేషన్ కొరకు మహబూబ్నగర్ రామిరెడ్డి లైన్స్ కంటి హస్పత్రికి ఉచిత బస్సులో పంపడం జరిగినది వారికి ఉచిత భోజన వసతి సదుపాయాలతో ఆపరేషన్ చేసి ఉచితంగా బస్సులో మక్తల్ కు పంపడం జరుగుతున్నది ఇట్టి కార్యక్రమంలోసభ్యులు రమేష్ రావు పాల్గొనడం జరిగినది

## పాల్వంచ 38వ డివిజన్‌లోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కార్పొరేటర్ బత్తుల మధుచంద్

**మన మహతి న్యూస్ ప్రతినిధి పాల్వంచ:**





3 జూన్ 2026 బుధవారం నాడు పాల్వంచ గట్టాయిగూడెం కు చెందిన కీర్తిశేషులు చందనబోయిన మల్లయ్య దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.పాల్వంచ 38వ డివిజన్‌లోని టీచర్స్ కాలనీకి చెందిన కేటీపీఎస్ ఉద్యోగి ఇర్ఫాన్ యాకూబీ పాషా కుమారుడు మహ్మద్ అలీ ఫంక్షన్‌లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో మెట్టు రాఘవరెడ్డి,అల్లి సాయికిరణ్,తుంగపాటి లక్ష్మీనారాయణ, సురేష్,హుస్సేన్,చందన బోయిన కుటుంబ సభ్యులు,ఇర్ఫాన్ యాకూబీ పాషా కుటుంబ సభ్యులు మిత్రులు పాల్గొన్నారు.

# తిరువూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిపోర్టింగ్ వివాదం - అధికారుల మౌనం పై ప్రజాల సందేహాలు

- అధికారి విధులలో ఉండగా మరో అధికారి ఎలా వచ్చారు?
- అవినీతి ఆరోపణలు ఎదుర్కుటున్న అధికారికి రిపోస్టింగ్ ఏమిటి ?
- సందేహాలకు తెర దించాలని కోరుతున్న ప్రజలు!

మన మహతిప్రతినిధి:భ్రమరాంబ తిరువూరు న్యూస్,జూన్.4

తిరువూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ రిపోస్టింగ్ అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. బదిలీ అయిన సంబంధిత అధికారి ఇప్పటికే కార్యాలయంలో విధులు హాజరవుతున్నారని సమాచారం ఉన్నప్పటికీ,అధికారి కార్యాలయంలో వుండగా మరో అధికారిని ఇన్చార్జిగా కొనసాగించడం ప్రజల్లో పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వులు,శాఖ




పరిపాలన నిర్ణయాల ప్రకారం బదిలీలు,రీపోస్టింగ్ అమలులోకి వస్తాయి. అయితే తిరువూరులో నెలకొన్న పరిస్థితులపై స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ నుండి స్పష్టమైన వివరణ వెలువడకపోవటం గందరగోళానికి కారణమవుతుంది. కార్యాలయానికి హాజరమవుతున్న అధికారికి పూర్తి బాధ్యతలు అప్పగించలేదా ? లేక పరిపాలన కారణాలతో ఇన్చార్జి వ్యవస్థ కొనసాగుతుందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి స్థానిక ప్రజలు,డాక్యుమెంట్ రైటర్లు,రిజిస్ట్రేషన్ సేవల కోసం కార్యాలయానికి వచ్చేవారు కూడా ఈ అంశంపై స్పష్టత కోరుతున్నారు. ఒకవైపు రిపోస్టింగ్ జరిగినట్లు సమాచారం ఉండగామరోవైపు ఇంచార్జ్ వ్యవహారం కొనసాగడం వల్ల శాఖలో సమన్వయ లోపం ఉందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.పరిపాలన వ్యవహారాల్లో పారదర్శకత,స్పష్టత అత్యంత అవసరం.ముఖ్యంగా భూముల రిజిస్ట్రేషన్లు,ఆస్తుల లావాదేవీలకు సంబంధించి ప్రజలు నేరుగా ఆధారపడే శాఖల్లో ఇటువంటి అనిచిత పరిస్థితులు సేవలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తిరువూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వాస్తవ పరిస్థితి ఏమిటి ? రిపోస్టింగ్ ఉత్తర్వులు అమలు స్థితి ఏమిటి ? ఇంచార్జ్ బాధ్యతలు ఎందుకు కొనసాగుతున్నాయి? అనే అంశాలపై ఉన్నతాధికారులు అధికారిక ప్రకటన విడుదల చేసి ప్రజల్లో నెలకొన్న సందేహాలకు తెరదించాలని స్థానికులు కోరుతున్నారు. రి పోస్టింగ్ అమల్లో ఉందా ? ఇంఛార్జ్ వ్యవస్థ ఎందుకు కొనసాగుతుంది? అధికారుల స్పష్టత ఎప్పుడు ? అనే ప్రశ్నలకు సమాధానం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. మరికొన్ని నిజాలు మరోచంచికలో

# నైపుణ్యాభివృద్ధికి గీతం పెద్దపీటఅభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో విద్యార్థులకు మార్గనిర్దేశం.

సంగారెడ్డి, జూన్ 03,మన మహతి న్యూస్ :
వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో విద్యార్థులకు స్పష్టత, దిశానిర్దేశం అందించే లక్ష్యంతో, గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్, శిక్షణ, మార్గదర్శనం, వృత్తిపరమైన సలహాలు (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులు పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాలను, కెరీర్ మార్గాలనునిర్మించుకోవడంలో సహాయపడటానికి రూపొందించిన సమగ్ర కెరీర్ మార్గ సూచీల శ్రేణిని ప్రవేశపెట్టారు.నేటి విద్యార్థులకు అపారమైన ఆశయాలు ఉన్నప్పటికీ, అభివృద్ధి చెందుతున్న అనేక రంగాలలో సరైన వృత్తి మార్గాన్ని ఎంచుకోవడంలో వారు తరచుగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని టీఎంసీజీ నిపుణులు గుర్తించారు. దానిని అధిగమించేలా, ప్రాథమిక అభ్యాసం నుంచి పరిశ్రమకు సిద్ధమయ్యే వరకు విద్యార్థుల ప్రయాణాన్ని సులభతరం చేసే నిర్మాణాత్మక అభ్యాస మార్గాలను వారు అభివృద్ధి చేశారు.కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్ వేర్ ఇంజనీరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, బ్లాక్ చెయిన్, వీఎల్ఎస్ఐ వంటి మరెన్నో సాంకేతికతలు అభివృద్ధి చెందడంతో, విద్యార్థులు తమ వృత్తి ప్రయాణాన్ని ఎక్కడ, ఎలా ప్రారంభించాలో గుర్తించడంలో తరచుగా తడబడుతున్నారు. ఈ అవసరాన్ని తీరుస్తూ, కొత్తగా ప్రారంభించిన మార్గ సూచీలు వృత్తి నిపుణులు కావాలనుకునే వారికి స్పష్టమైన,



ఆచరణాత్మకమైక అభ్యాస మార్గాన్ని అందిస్తున్నాయి. సాంకేతికేతర కెరీర్ రంగాలతో సహా, మరిన్ని అదనపు మార్గ సూచీలు కూడా ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్నాయి. ఈ కార్యక్రమం గురించి డాక్టర్ రోజీనా మాథ్యూ మాట్లాడుతూ, టెక్నాలజీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, వృత్తిపరమైన విజయానికి నిరంతర అభ్యాసం అత్యవసరమని స్పష్టీకరించారు. తాము రూపొందించినమార్గదర్శకాలు విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, ఒక లక్ష్యంతో, నిర్మాణాత్మక మార్గదర్శనంతో అభివృద్ధి చెందుతున్న రంగాలను అన్వేషించంలోసహాయపడటానికిఉద్దేశించినట్టుతెలియజేశా రు.'ఏమి నేర్చుకోవాలి, ఎప్పుడు నేర్చుకోవాలి, ప్రాథమిక స్థాయి భావనల నుంచి పరిశ్రమకు సిద్ధంగా ఉన్న నిపుణులుగా ఎలా ఎదగాలి అనే విషయాలనువిద్యార్థులు అర్థంచేసుకోవడంలోసహాయపడటానికి ఈ మార్గ సూచీలను రూపొందించాం. ఒక విద్యార్థి ఒక రంగాన్ని మొదటిసారి అన్వేషిస్తున్నా లేదా నైపుణ్యాలను పెంచుకునే తదుపరి దశకు ప్రణాళిక వేస్తున్నా, ఈ వనరులు ఒక విలువైన ప్రారంభ బిందువుగా ఉపయోగపడతాయి' అని డాక్టర్ రోజీనా వివరించారు.

పరిశ్రమ పోకడలు, సాంకేతిక పురోగతులకు అనుగుణంగా నిరంతరం అధునాతనను సంతరించుకునే సజీవ పత్రాలుగా ఈ మార్గ సూచీలను రూపొందించారు. భవిష్యత్ అభ్యాసకులకు ఈ వనరులు ప్రయోజనకరంగా ఉండేలా చూసేందుకు, లేదా మెరుగుదల కోసం సూచనలు తెలియజేయమని విద్యార్థులను అధ్యాపకులు ప్రోత్సహిస్తున్నారు. నైపుణ్యాభివృద్ధి దిశగా చురుకైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహిస్తూ,'ప్రారంభించడానికి ఉత్తమ సమయం నిన్న. రెండవ ఉత్తమ సమయం ఇప్పుడే' అని వారు ప్రేరేపిస్తున్నారు.

విద్యార్థులకు ఆచరణాత్మక మార్గదర్శనం,మెంటార్ షిప్, క్రమబద్ధమైన కెరీర్ అభివృద్ధి వనరులను అందించడం ద్వారా, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నిపుణులను తీర్చిదిద్దడంలో గీతం యొక్క నిరంతర నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తోంది.

'అన్వేషించండి, నేర్చుకోండి, నిర్మించండి, ఎదగండి' అనేది ఈ పరివర్తనాత్మక కార్యక్రమానికి మార్గదర్శక సందేశంగా ఈ వినూత్న కార్యక్రమం నిలుస్తుంది.

# బొర్పట్లలో రూ.1,000 కోట్ల థెరానైమ్ బయోలాజిక్స్ ప్లాంట్ ప్రారంభం.

- మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభం -- 1,500 మందికి ఉపాధి అవకాశాలు.

సంగారెడ్డి, జూన్ 3, మన మహతి న్యూస్ :
తెలంగాణను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు పడింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బొర్పట్ల గ్రామంలో రూ.1,000 కోట్ల పెట్టుబడితో నిర్మించిన థెరానైమ్ బయోలాజిక్స్ అత్యాధునిక తయారీ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం అధికారికంగాప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఔరోబిందో ఫార్మా చైర్మన్ నిత్యానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ ఔషధ సంస్థ ఔరోబిందో ఫార్మా కు చెందిన పూర్తి స్థాయి అనుబంధ సంస్థ అయిన థెరానైమ్ బయోలాజిక్స్ ఈ ప్లాంట్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించింది. క్యాన్సర్‌తో పాటు ఇతర ప్రాణాంతక వ్యాధుల



చికిత్సలో ఉపయోగించే బయోలాజిక్స్, జీవరసాయన ఔషధాలను ఇక్కడతయారుచేయనున్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్లాంట్ ఏర్పాటు ద్వారా స్థానిక ప్రాంతానికి చెందిన 1,500 మందికి పైగా యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.ఇక్కడ ఉత్పత్తి అయ్యే నాణ్యమైన ఔషధాలను అమెరికా సహా పలు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్‌కు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపులభిస్తుందని అన్నారు.గ్లోబల్ ఫార్మా దిగ్గజ సంస్థ మీణ సింగపూర్ విభాగంతో కుదిరిన మాస్టర్ సర్వీస్ అగ్రిమెంట్ (మీసా)లో



భాగంగా ఈ కాంట్రాక్ట్ బయో–మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను నిర్మించినట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. అత్యాధునిక మేమాలియన్ సెల్ కల్చర్ బయోరియాక్టర్లు, సంవత్సరానికి 2.5 నుంచి 3 కోట్ల వయల్స్ ఉత్పత్తి చేసే సామర్థ్యం గల ఐసోలేటర్ లైన్లతో ఈ ఫెసిలిటీని ఏర్పాటు చేశారు. తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధికి, ఫార్మా రంగ విస్తరణకు ఈ ప్లాంట్ కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు,ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా.వీడ్కోలు .సమావేశం

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట.
జిల్లా వ్యవసాయ అధికారి ఏ డి ఏ జాన్ సుధాకర్ ఉన్నత పదవి పొందిన సందర్భంగా నారాయణపేట నుండి జగిత్యాలకు బదిలీ కావడం సందర్భంగా వీడ్కోలు సమావేశానికి భారతీయ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, జిల్లా ఉపాధ్యక్షులు శరణమయ్య స్వామి సహ కార్యదర్శి ప్రభువు మిస్కిన్, సహకార దర్శి ఓబులాపురం మహిపాల్ రెడ్డి సూర్యకాంత్ మాజీ కౌన్సిలర్ శాలువాతో ఘనంగా సత్కరించి రైతుల ఆరాధ దైవము శ్రీ భగవాన్ బలరాముని ఫోటో బహుకరించడం జరిగినది. తర్వాత రైతు నాయకుడు వెంకోబా మాట్లాడుతూ జాన్ సుధాకర్ పదవిలోచేసిన సేవలు రైతులకు రాత్రి పగలు ఏ ఇబ్బందులు వచ్చినా పలకరించే మనస్తత్వం ఉన్న బాధ్యతగల అధికారి వెంటనే సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేకూరే వ్యక్తి. జాన్ సుధాకర్ అంటే జాన్ అంటే హృదయం ప్రేమ అని అర్థము ఆయనకు ఉన్నది పనిలో కూడా ఆయన ప్రేమతో రైతాంగ కార్యక్రమాలు నిమగ్నమయ్యేవారు జిల్లాలో అన్ని మండలాల రైతుల మనోభావాలను పరిగణలోకి తీసుకొని



ఎప్పటికప్పుడు ఏ ఇబ్బందులున్న పరిష్కరించి అక్కడ అధికారులతో ఇక్కడ రైతాంగంతో మమకారం పొందేవారు చాలా పేరు సంపాదించి అందరితో కలిసి మెలిసి పనిచేసే అధికారి, అదే కాక అన్ని డిపార్టుమెంట్లు పేరు సంపాదించుకొని అన్ని డిపార్ట్మెంట్లో అధికారులతో పని తీసుకునేవారు ఇన్ని రోజులు పని చేస్తున్న వ్యవసాయక శాఖ పేరు ప్రతిష్టలు సంపాదించినారు సార్ గారి హయంలో నలుగురు కలెక్టర్లు దగ్గర మంచి పేరు సంపాదించి వ్యవసాయ శాఖకు జిల్లాలనే తెలంగాణలో మంచి వ్యవసాయ అధికారిగా అవార్డుల పొందిన వ్యక్తి ఇలాంటి అధికారి మా నారాయణపేట జిల్లా రైతులకు దొరకడం మా అదృష్టంగా భావిస్తూ సారు ప్రమోషన్ గా పోతున్న సందర్భంగా చాలా బాధనిపిస్తుంది ఇలాంటి అధికారి ఇక్కడ చేసినా కూడా రైతులకు న్యాయం జరుగుతుంది అనే హామీ కనిపిస్తుంది ఈ ప్రాంత రైతాంగానికి భారతీయ కిసాన్ సంఘ ద్వారా మేము ఎన్నో పనులు విత్తనాలు అయితే మీ ఎరువులు అయితే ఏమి పంట దిగుబడలకు రసాయనక మందుల పిచికారికి ఎప్పటికప్పుడు సహకారం తీసుకోవడం జరిగిన సందర్భంగా ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేక పోతున్నాము ఈ యొక్క కార్యక్రమంలో వ్యవసాయ వివిధ పదవుల సిబ్బంది అధికారులు ఏవోలు ఏఈవోలు ఎరువుల మందుల దుకాణాల యజమానులు వారి అసోసియేషన్ మిత్రులు శ్రేయోభిలాషులు మరియు కొత్తగా బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సఖియా నాయక్ ఉద్యాన శాఖ జిల్లా అధికారి సాయిబాబా పాల్గొన్నారు

# రైతుల సేవే సొసైటీ పాలకవర్గం లక్ష్యం మన మహతి న్యూస్ ప్రతినిధి పాల్వంచ:

3జూన్ 2026





బుధవారం పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా జిలుగులు (పచ్చిరొట్ట) విత్తనాల పంపిణిని కొత్వాల ప్రారంభించారు.

ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రైతుల సేవే సొసైటీ పాలకవర్గం లక్ష్యం అని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు,రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్,డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.సొసైటీ ద్వారా 10 టన్నుల జిలుగులు పంపిణి చేయనున్నామన్నారు.జిలుగులుపై 50 శాతం సబ్సిడీతో 30 కేజీ ల బస్తా 2,452.75 రూపాయలకు పంపిణి చేస్తారన్నారు. రెండున్నర ఎకరాలకు (హెక్టారుకు) 1 బస్తా ఇవ్వనున్నామని,రైతులు పట్టాదారు పాస్ బుక్ ద్వారా వ్యవసాయ శాఖా ద్వారా కూపన్ తీసుకోవాలని అన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్,డైరెక్టర్లు బుడగం రామ మోహనరావు, కనగాల నారాయణరావు,చౌగాని పాపారావు,సామా జనార్ధన రెడ్డి,జరబన సీతారాంబాబు,భూక్యా కిషన్,సీఈఓ జి.లక్ష్మీనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సబ్ ఇన్స్పెక్టర్ ల ను మర్యాదపూర్వకంగా కలసి మ్యాంగో(ఫ్రూట్స్ )ను అందించిన

- ఎం.వి.ఎస్ ఫౌండేషన్ హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ సభ్యులు!

మన మహతిప్రతినిది .:భ్రమరాంబ తిరువూరు న్యూస్,జూన్.4





ఇటీవల కాలంలో ఎం వి ఎస్ ఫౌండేషన్ హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ ఉచిత హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి శాంతి భద్రతలు కాపాడిన సందర్భంగా సెక్టార్ టు ఎస్సై కే.రాజు మహిళా సబ్ ఇన్స్పెక్టర్ గౌరీశ్వరి ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞత అభినందనలు తెలిపి మామిడిపండ్ల బాక్సులను అందజేసిన
ఎం వి ఎస్ ఫౌండేషన్ హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ సభ్యులు గుంజా శివకుమార్ (వెంకీ),మామిడి విజయ్,మాదాసు టైటస్

# వచ్చే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్ గా అందరూ సమన్వయం తో పనిచేయాలి

- సదాశివపేట కార్యకర్తల సమావేశం లో సదాశివపేట వ్యవహారాల ఇంచార్జ్ తోపాజి అనంత్ కిషన్.



సంగారెడ్డి, జూన్ 03,మన మహతి న్యూస్ :
రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడు పని చేయాలని టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ అన్నారు. బుధవారం సదాశివపేట పేట పట్టణం లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదాశివపేట కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ గా తోపాజి అనంత్ కిషన్ నియామకం అయిన అనంతరం జరిగిన మొదటి సమావేశం ఇది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంత్ కిషన్, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి లను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా తోపాజి అనంత్ కిషన్ మాట్లాడుతూ సదాశివపేట మున్సిపాలిటీ లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లు, వార్డ్ ఇంచార్జి లు అందరూ సమన్వయం తో పనిచేయాలన్నారు. ఎవరి వార్డు పరిధి లో వారు పనిచేయాలని, కాంగ్రెస్ అభ్యర్థులు గెలవని వార్డుల్లో వార్డ్ ఇంఛార్జ్ లదే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కాంగ్రెసు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సారథ్యం లో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు మునిపల్లె సత్యనారాయణ, చిరు, వాసిం,సిద్దన్న, కంది కృష్ణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీహరి, పట్నం సుభాష్, చోటు భాయ్,మున్సిపల్ కౌన్సిలర్లు శంకర్ గౌడ్, అరుణ్ కుమార్, నాగరాజు, నర్సింలు, విష్ణు వర్ధన్ రెడ్డి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ---జర్మనీలోని తురింగియా రాష్ట్రం మధ్య ఎంఓయూ

**●టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం కీలక ఒప్పందం**

**●తెలంగాణ రైజింగ్ దర్శనీకతపై జర్మనీ ప్రతినిధుల ప్రశంసలు**

తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి చర్యలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమైన తెలంగాణతో, జర్మనీలోని తురింగియా రాష్ట్రం పలు కీలక రంగాల్లో భాగస్వామ్యానికి ముందుకొచ్చింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర ముఖ్యమంత్రి మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**తెలంగాణ ప్రగతికి జర్మనీ కితాబు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా రాష్ట్ర ముఖ్యమంత్రి మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన "తెలంగాణ రైజింగ్ – 2047" విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత–జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు.

ఈ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని వివరించారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా ముఖ్యమంత్రి మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు.తెలంగాణ యువత ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభను చాటుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీ విజయాల్లో తెలంగాణ యువత కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ప్రపంచంలోని అనేక అగ్రశ్రేణి సంస్థల్లో హైదరాబాద్‌కు చెందినవారే కీలక పదవుల్లో ఉన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో జర్మన్ భాషా పరిజ్ఞానం కూడా ఎంతో అవసరమని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో జర్మన్ భాషా శిక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంలో సహకరించాలని తురింగియా ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ గురించి కూడా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వివరించారు. ప్రపంచంలోని ఫార్చ్యూన్–500 కంపెనీలను తెలంగాణకు ఆకర్షించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నామని తెలిపారు. వ్యాపారాలకు అవసరమైన ప్రపంచ స్థాయి వసతులు హైదరాబాద్‌లో ఉన్నాయని చెప్పారు. ఇటీవల మిస్ వరల్డ్–2025 పోటీలకు వందకు పైగా దేశాల ప్రతినిధులు హైదరాబాద్‌కు రావడం రాష్ట్ర ప్రతిష్టకు నిదర్శనమన్నారు.సెమీకండక్టర్ రంగంలో కొత్త అవకాశాలుజర్మనీలోని తురింగియా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు.పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.తురింగియా స్టేట్ సెక్రెటరీలు డా. ట్రైచార్ట్, సకెర్ట్, జర్మన్ కాన్సుల్ జనరల్ హాస్పర్ సహా వివిధ రంగాలకు సంబంధించిన జర్మనీ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి అజిత్ రెడ్డి, టీజీఐఐసి ఎండి శశాంక కూడా పాల్గొన్నారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్ గా అందరూ సమన్వయం తో పనిచేయాలి

**-సదాశివపేట కార్యకర్తల సమావేశం లో సదాశివపేట వ్యవహారాల ఇంచార్జ్ తోపాజి అనంత్ కిషన్**



రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడు పని చేయాలని టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ అన్నారు. బుధవారం సదాశివపేట పేట పట్టణం లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదాశివపేట కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ గా తోపాజి అనంత్ కిషన్ నియామకం అయిన అనంతరం జరిగిన మొదటి సమావేశం ఇది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంత్ కిషన్, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తోపాజి అనంత్ కిషన్ మాట్లాడుతూ సదాశివపేట మున్సిపాలిటీ లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లు, వార్డ్ ఇంచార్జి లు అందరూ సమన్వయం తో పనిచేయాలన్నారు. ఎవరి వార్డు పరిధి లో వారు పనిచేయాలని, కాంగ్రెస్ అభ్యర్థులు గెలవని వార్డుల్లో వార్డ్ ఇంఛార్జ్ లదే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కాంగ్రెసు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సారథ్యం లో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు మునిపల్లె సత్యనారాయణ, చిరు, వాసిం, సిద్దన్న, కంది కృష్ణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీహరి, పట్నం సుభాష్, చోటు భాయ్, మున్సిపల్ కౌన్సిలర్లు శంకర్ గౌడ్, అరుణ్ కుమార్, నాగరాజు, నర్సింలు, విష్ణు వర్ధన్ రెడ్డి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# బొర్పట్లలో రూ.1,000 కోట్లతో 'థెరానైమ్ బయోలాజిక్స్' ప్లాంట్ ను ప్రారంబించిన మంత్రి శ్రీధర్ బాబు

**●హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, అరబిందో చైర్మెన్ నిత్యానంద రెడ్డి**



తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చే దిశగా మరో కీలక అడుగు పడింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బొర్పట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన థెరానైమ్ బయోలాజిక్స్ తయారీ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.ప్రముఖ ఔషధ సంస్థ 'అరబిందో ఫార్మా'కు చెందిన పూర్తి స్థాయి అనుబంధ విభాగమైన థెరానైమ్ బయోలాజిక్స్, దాదాపు రూ.1,000 కోట్ల భారీ పెట్టుబడితో ఈ అత్యాధునిక ప్లాంట్‌ను నిర్మించింది.ఈ భారీ ప్లాంట్ ఏర్పాటు ద్వారా స్థానిక ప్రాంతానికి చెందిన 1,500 మందికి పైగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు.ఈ బయోలాజికల్ ప్లాంట్‌లో క్యాన్సర్ (ఝుఅషెవతీ) మరియు ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సలో ఉపయోగించే అత్యాధునిక బయోలాజిక్స్, జీవ రసాయన మందులను తయారు చేయనున్నారు.ఇక్కడ ఉత్పత్తి అయ్యే నాణ్యమైన ఔషధాలను అమెరికా (ఖూూా) సహా పలు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయనున్నారు. "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ ప్రతిష్టను ఇది ప్రపంచవ్యాప్తంగా మరింత పెంచుతుందని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.థెరానైమ్ సంస్థ గ్లోబల్ ఫార్మా దిగ్గజం మీణ (వీవతీషెని వాష్ణుతీజూ ఽ ఎశీఝుస్త్రవ) సింగపూర్ విభాగంతో కుదుర్చుకున్న మాస్టర్ సర్వీస్ అగ్రిమెంట్ (మీూా) లో భాగంగా ఈ కాంట్రాక్ట్ బయో–మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను నిర్మించింది.ఈ ఫెసిలిటీలో అత్యాధునిక మేమాలియన్ సెల్ కల్చర్ బయోరియాక్టర్లతో పాటు, ఏడాదికి సుమారు 2.5 నుంచి 3 కోట్ల (25–30 మిలియన్) వయల్స్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్న ఐసోలేటర్ లైన్లను ఏర్పాటు చేశారు. తెలంగాణలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా, స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఫార్మా రంగ పెట్టుబడులకు తెలంగాణ ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యతగా నిలుస్తుందని ఈ సందర్భంగా మంత్రి ?డి. శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు

# సంగారెడ్డిలో నాణ్యమైన విద్యకు కొత్త చిరునామా -- కృపానిధి హై స్కూల్.




**సంగారెడ్డి, జూన్ 03,మన మహతి న్యూస్ :** విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సంగారెడ్డిలో కృపానిధి హై స్కూల్ నూతన విద్యా సంవత్సరం అడ్మిషన్లను ప్రారంభించింది. ఆధునిక సౌకర్యాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం, క్రమశిక్షణతో కూడిన విద్యా విధానంతో ఈ విద్యాసంస్థ విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించేందుకు కృషి చేస్తోంది.పాఠశాల డైరెక్టర్ మరియు ప్రిన్సిపాల్ కృపానిధి పరిడా ఆధ్వర్యంలో విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, విద్యా ప్రతిభ, నైతిక విలువలు పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలునిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధునిక తరగతి గదులు, విశాలమైన భవనం, విద్యార్థి కేంద్రిత బోధన విధానాలు ఈ పాఠశాల ప్రత్యేకతలుగానిలుస్తున్నాయిఈ సందర్భంగా కృపానిధి పరిడా మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రతి విద్యార్థి తన లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించడం మా ప్రధాన ఉద్దేశ్యం" అని పేర్కొన్నారు.ప్రస్తుతం అన్ని తరగతులకు అడ్మిషన్లుకొనసాగుతున్నాయని, తల్లిదండ్రులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని పాఠశాల యాజమాన్యం కోరింది. విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు, నాయకత్వ లక్షణాల పెంపకానికి కృపానిధి హై స్కూల్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

# దేశస్థాయిలోనే ఉత్తమ ప్రాజెక్టు అధికారిగా అవార్డు అందుకున్న బి.రాహుల్ ఐఏఎస్




**మన మహతి న్యూస్ భద్రాచలం**

ఐటీడీఏ ద్వారా ప్రవేశపెడుతున్న గిరిజన సంక్షేమ పథకాలు అమలులో అంకిత భావం నిబద్ధత మరియు గిరిజనుల సంక్షేమం కొరకు అభివృద్ధి పట్ల విశిష్ట సేవలు అందించినందుకు గాను ఉత్తమ ప్రాజెక్టు అధికారిగా అవార్డు అందుకోవడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.

బుధవారం నాడు ఢిల్లీలోని విజ్ఞాన భవన్లో జరిగిన జాతీయ పీవోస్ కార్పొరేషన్ లో దేశంలోని ఉత్తమ ప్రాజెక్టు అధికారిగా అవార్డును నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్ ట్రైబల్ అఫైర్స్ మినిస్ట్రీస్ సెక్రెటరీ రంజాన్ చోప్రా చేతుల మీదుగా ఐదు లక్షల రూపాయల ప్రోత్సాహ పురస్కారాన్ని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తో కలిసి అందుకోవడం జరిగిందని ఆయన అన్నారు.

అవార్డు అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాటుచేసినగిరిజన మ్యూజియం, ఎస్ సి హెచ్ జి మహిళలు గిరిజన రైతులు చిన్న తరహా పరిశ్రమలు నడుపుకుంటున్న గిరిజన మహిళలకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ మరియు జిపిఎస్ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు విద్యార్థిని విద్యార్థులకు ఉద్దీపకం మరియు కెరీర్ గైడెన్స్ అమలు చేయడం గిరిజన తెగల గోత్రాల సేకరణ చేసి ఇలవేల్పుల చరిత్ర తో పాటు క్రీడల ప్రోత్సాహం తదితర కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు ఈ పురస్కారం లభించిందని అన్నారు.

మంచిర్యాల జిల్లాలో స్థానిక సంస్థల జేసీగా పని చేసినప్పుడు బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డును గవర్నర్ చేతులు మీదుగా బెస్ట్ రూరల్ టూరిజం అవార్డును ముఖ్యమంత్రి చేతులు మీదుగా ఆదివాసి గిరిజనుల ఐక్యవేదిక తరపున ఆదివాసి వికాసరత్న బిరుదును అందుకోవడం జరిగిందని ఐటిడిఏ సంక్షేమ పథకాలు మరియు గిరిజనుల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నందుకు ఇప్పుడు జాతీయ స్థాయిలో అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

# ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్స్ లబ్ధిదారులకు అందజేత

**మన మహతి న్యూస్ ప్రతినిధి.**



నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ 4వ వార్డుకు చెందిన మామిళ్ళ జయమ్మకు వార్డ్ కౌన్సిలర్ పీకే నర్సింహా, వార్డ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్స్ కాపీని అందజేశారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి. శివకుమార్, జి కొండయ్య, శివకుమార్, రవికుమార్ పాల్గొన్నారు. ఈ సంఘటన 2026, జూన్ 3న జరిగింది.

# బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి: సర్పంచ్ శ్వేత, హెచ్ఎం డాక్టర్ షేక్ మీరా హుస్సేన్

**మణుగూరు, జూన్ 3: మన మహతి న్యూస్**




బడి ఈడు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కూనవరం గ్రామపంచాయతీ సర్పంచ్ దేనిక శ్వేత, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ షేక్ మీరా హుస్సేన్ పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మణుగూరు కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో వారు తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు.మణుగూరు మండలంలో ప్రీ–ప్రైమరీ తరగతుల ప్రారంభానికి పైలట్ ప్రాజెక్టుగా కూనవరం ప్రాథమికోన్నత పాఠశాల ఎంపిక కావడం విశేషమని తెలిపారు. అనంతరం అందరి చేత బడిబాట ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్వేత మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వార్డు సభ్యురాలు వరాలమ్మ, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయులు సారయ్య, రుక్మిణి, రేగా జయలక్ష్మి, అనిత, మాధురి, అంగన్వాడీ సిబ్బంది, డ్వాక్రా సభ్యులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com